




# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 09-01-2024 సంపుటి : 06 సంచిక : 121 పేజీలు : 8 వెల : రూ 3-00


# మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం



విజయవాడ,జనవరి8( విభారె) : సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన కలెక్టరేట్ ఆందోళన విజయవాడలో ఉద్రిక్తతలకు దారి తీసింది. బందర్ రోడ్డులో మున్సిపల్ కార్మికుల డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మె భాగంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడికి యత్రించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సిపిఎం నేత సిహెచ్.బాబురావుతోపాటు పలువురు కార్మిక నేతలను, మహిళలను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టుచేశారు.అరెస్టు చేసిన వారిని పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.మున్సిపల్‌యూనియన్ గౌరవాధ్యక్షుడు కాశీనాథ్ తదితర నాయకులు గవర్నర్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించగా, కొందరిని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన మరికొంతమంది కార్మికులను హనుమాన్‌పేట కళ్యాణ మండపంలో పెట్టారు. అయినా వారి ఆందోళన కొనసాగింది. వైసీపీ ప్రభుత్వ దౌర్జన్యాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. ఆందోళన ఆపేది లేదని, కొనసాగిస్తామని నేతలు హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని జరిగిన నిరసన కార్యక్రమాన్ని నిర్భంధంతో అణచవేసే చర్యలు మానుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కి వెళ్తున్న మున్సిపల్ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ



వారికి మద్దతు తెలిపిన సిపిఎం నేతలు పి మధు, వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబూరావు, తదితరులు. నిరవధిక సమ్మె 14 రోజులుగా చేస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడం లేదని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. నంద్యాల, బేతంచెర్ల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ ,నందికొట్కూరు 500 మందిపైగా మున్సిపల్ కార్మికులు ధర్నాకు దిగారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. గుంటూరు జిల్లా మున్సిపల్ కార్మికుల 14వరోజు నిరవధిక సమ్మెలో భాగంగా మార్కెట్ సెంటర్ నుండి గుంటూరు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మునిసిపల్ కార్మికులు భైఠాయించారు. శానిటేషన్ వర్కర్ల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని సిఐటియు నాయకులు

**కలెక్టరేట్ ఎదుట ఆందోళనతో ఉద్రిక్తం**

**సిఐటియూ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన**

**నేతలను ఎక్కడిక్కడే అరెస్ట్ చేసిన పోలీసులు**



నందీశ్వర రావు డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కరించాలని శానిటేషన్ వర్కర్స్ చేస్తున్న సమ్మె సోమవారం 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం పిఠాపురం నగర పంచాయతీ కార్యాలయాన్ని శానిటేషన్ వర్కర్లు ముట్టడించారు. ఈ సందర్భంగా నందీశ్వర రావు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యేసమ్మ లు మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, చనిపోయిన వర్కర్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందిం చకపోవడం బాధాకరమన్నారు.

ఎన్నికల ముందు జగన్ కనీస వేతనం ఇస్తానని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని హామీ నేటికీ హామీగానే ఉండిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న హెల్త్ అలివేన్స్ కోవిడ్ కాలంలో బకాయిలో ఉన్న ఆరు నెలల వేతనాలను తక్షణం విడుదల చేయాలని అంతవరకు సమ్మె విరమించేది లేదన్నారు.దీని పై కమిషనర్ ఎం సత్య నారాయణ మాట్లాడాతూ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుత అని స్థానికంగా ఉండే సమస్యల పరిష్కారం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కర్స్ లోవబాబు,బి సత్యవతి,సి హెచ్ రామారావు,జి రాజులు,రాజమో హన్, రాములమ్మ, లక్ష్మి, పార్వతి, పైడిరాజు ,సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా రాష్ట్రంలో గంజాయి వాడకం

**విద్యార్థులకు అందుబాటులో రావడం దురదృష్టకరం**

**ఆరోపణలు గుప్పించిన టిడిపి నేత లోకేశ్**



అమరావతి,జనవరి8( విభారె) :వైసీపీ హయాంలో రాష్ట్రంలో గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. సర్కారు పాపాలు.. పాఠశాల విద్యార్థుల పాలిట శాపాలుగా మారాయని అన్నారు. పాఠశాలల్లో గంజాయి, మద్యం, అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయని ఆరోపించారు. విద్యార్థి దశలోనే పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజలారా కలిసి రండి.. మహమ్మారిపై యుద్ధం చేద్దాం' అని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. 'వైసీపీ పాలనలో బడి, గుడిలోకి గంజాయి వచ్చేసింది. విద్యార్థులు మద్యం మత్తులో బడికొస్తున్నారు. సీఎం జగన్ ఇంటి ఎదురుగా గంజాయికి బానిసైన పిల్లాడి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తే పోలీసులు బలవంతంగా నోరు మూయించారు. సీఎం ఇంటి సమీపంలో డ్రగ్స్ మత్తులో గ్యాంగ్ రేప్ జరిగితే నేటికీ నిందితున్ని పట్టుకోలేదు. సీఎం ఇంటికి దగ్గరలో మద్యం మత్తులో ఉన్మాది.. అంధురాలిని హత్యచేస్తే చర్యల్లేవు. చంద్రగిరిలో 9వ తరగతి అమ్మాయి గంజాయికి బానిసైంది. చోడవరంలో ఏడో తరగతి విద్యార్థులు స్కూలులో మద్యం తాగారు. వీడియో తీసిన వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. విచ్చలవిడి గంజాయి, డ్రగ్స్, మద్యం విషాదాలు చూసి ఆవేదనతో కట్టడి చేయాలని ప్రభుత్వాన్ని కోరాను, లేఖలు రాశాను. కనీస చర్యలు తీసుకుపోగా.. టీడీపీ కార్యాలయంపైనే దాడులు చేశారు. పిల్లలు, యువత బంగారు భవిష్యత్తు నాశనం కావడం చూసి ఆందోళనతో ప్రధానికి లేఖ రాశాను. కేంద్రానికి వినతులు పంపాను. గవర్నర్‌ని కలిసి వివరించాను. గంజాయి, మద్యం, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాల నుంచి పిల్లల్ని కాపాడే వరకూ పోరాడుతూనే ఉంటా.

# కాంగ్రెస్‌లో అనూహ్య మార్పులు

**మళ్లీ చురుకుగా సీనియర్ నేతలు**

**రాజమండ్రిలో ప్రత్యక్షమైన లగడపాటి**

**ఉండవల్లి హర్షకుమార్‌లతో భేటీ**

**వారు పోటీచేస్తే మద్దతుగా నిలుస్తానని ప్రకటన**

**తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానని వెల్లడి**

రాజమండ్రి,జనవరి8: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అనూహ్యంగా మారుతున్నాయి. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరాక ఎపిలో కాంగ్రెస్ నేతలు చురుకుగా వ్యవహరిస్తున్నారు. సీనియర్ నేతలు మంతనాలు జరుపుతూ చురుకుగా మారారు. ఆమె ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.ఈసమయంలోమాజీఎంపీలగడపాటిరాజగోపాల్ అనూహ్యంగా తెరపైకి వచ్చారు. తను ప్రతక్ష్యరాజకీయాల్లోకి రానంటూనే రాజమండ్రిలో ప్రత్యక్ష మయ్యారు. ఆయన మాజీ ఎంపీ హర్ష కుమార్‌తో పాటు ఉండవల్లి అరుణ్ కుమార్‌తో సమావేశం అయ్యారు. ఈ సమావేశం రాజకీయంగా కలకలం రేపుతోంది. లగడపాటి రాజగోపాల్ రాష్ట్ర విభజన జరిగితే రాజకీయ సన్యాసం చేస్తానని ప్రకటించారు. ఆ మాట మేరకు ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఎక్కువగా ఢిల్లీలోనే ఉంటున్నారు. వ్యాపార వ్యవహారాలు చూసుకుంటున్నారు. అయితే ఏపీకి వచ్చినప్పుడు మాత్రం రాజకీయ స్నేహితుల్ని కలుస్తూ ఉంటారు.ఆ సమయంలో ఆయన రాజకీయంపై చర్చ జరుగుతూ ఉంటుంది. షర్మిలను ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా చేసే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసిన తర్వాత లగడపాటి రాజగోపాల్ రాజమండ్రికి రావడం ఇద్దరు సీనియర్ మాజీ ఎంపీలతో సమావేశం కావడం సహజంగానే ఆసక్తి రేపుతోంది. హర్షకుమార్ కాంగ్రెస్ లోనే ఉన్నారు. కానీ ఆయన యాక్టివ్ గా లేరు. షర్మిలను చీఫ్‌గా చేస్తారన్న ప్రచారం తర్వాత ఆయన వ్యతిరేకంగా స్పందించారు. రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఊడిగం చేయడానికే ఏపీ కాంగ్రెస్ ఉందా అని ప్రశ్నించారు. అలాగే ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా ఏ పార్టీలో లేరు. కిరణ్ కుమార్ రెడ్డి జై సమైక్యాంధ్ర పార్టీలో పని చేసిన ఆయన తర్వాత సైలెంట్ అయ్యారు. అప్పుడప్పుడూ ప్రెస్ మీట్లు పెట్టి వైసీపీ అధినేత జగన్ కు సానుకూలంగా మాట్లాడుతారన్న అభిప్రాయం ఉంది. అయితే ఆయన అధికారికంగా వైసీపీలో చేరలేదు. ఆయనకు రాజ్యసభ, ఎమ్మెల్సీ లాంటి పదవులు కూడా వైసీపీ ఆఫర్ చేయలేదు. ఇప్పుడు హర్ష కుమార్ తో పాటు ఉండవల్లి అరుణ్ కుమార్ ను మళ్లీ కాంగ్రెస్ లో యాక్టివ్ అయ్యేలా చూసేందుకు వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఒప్పించేందుకు లగడపాటి ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. షర్మిలకు మద్దతుగా సైలెంట్ గా ఉండిపోయిన కాంగ్రెస్ నేతల్ని లగడపాటి తెరపైకి తెస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. అయితే లగడపాటి రాజగోపాల్ మాత్రం.. అలాంటిదేమీ లేదంటున్నారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేది లేదని చెబుతున్నారు. రాష్ట్ర విభజనతోనే తన రాజకీయ జీవితం ముగిసిపోయిందని.. మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమే లేదని ఆయన చెబుతున్నారు. ఓ కార్యక్రమం కోసం రాజమండ్రి వచ్చానని.. ఎప్పుడు రాజమండ్రి వచ్చినా హర్ష కుమార్ ను.. ఉండవల్లి అరుణ్ కుమార్‌ను కలవడం సహజమేనని చెబుతున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ పగ్గాలు చేపట్టిన తర్వాత.. ఎప్పటిలా స్తబ్దుగా ఉండకుండా పూర్తి స్థాయిలో యాక్టివ్ అయ్యేలా చూసేందుకు తెరవెనుక మంత్రాగంం జరుగుతున్నట్లుగా రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అయితే తాను క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ స్పష్టం చేశారు.

## మంత్రి బొత్సను అడ్డుకున్న అంగన్‌వాడీలు

**సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**పోలీసుల జోక్యంతో మంత్రి పర్యటన**

విజయనగరం,జనవరి8 ): మంత్రి బొత్స సత్యనారాయణకు చేదు అనుభవం ఎదురైంది. తమ డిమాండ్లను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందంటూ అంగన్వాడీలు మంత్రి బొత్స కాన్వాయ్ ను అడ్డుకున్నారు. దాదాపు అరగంటపాటు మంత్రి బొత్స సత్యనారాయణకు అంగన్వాడీలు దారివ్వలేదు. కొందరు ఈ తతంగాన్ని వీడియో తీసే ప్రయత్నం చేయగా, వీడియో తీయవద్దంటూ సీరియస్ అయ్యారు. పోలీసులు జోక్యం చేసుకుని అంగన్వాడీలకు సర్దిచెప్పడంతో మంత్రి బొత్స కారులో వెళ్లిపోయారు. సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లాలో పర్యటిస్తున్నారు. మెంటాడ మండలం పర్యటన ముగించుకుని ఆయన విజయనగరం వెళుతున్నారు. ఈ క్రమంలో గజపతినగరంలో అంగన్వాడి వర్కర్స్ మంత్రి బొత్స సత్యనారాయణ వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ జీతాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. తాను ఇంతకుముందే చెప్పినట్లు మూడు నెలల తరువాతే మీ వేతనాలు పెంచుతామని చెప్పారు. మొత్తం 11 డిమాండ్లు చేయగా ఇప్పటికే అంగన్వాడీల 10 డిమాండ్లు నెరవేర్చామన్నారు. ప్రస్తుతం జీతాల పెంపు గురించి అడగవద్దని, 3 నెలల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని అప్పుడు మీ డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ మంగళవారం నుంచి విధులకు హాజరుకావాలని సూచించారు. కానీ అంగన్వాడీలు మాత్రం జీతాలు పెంచితే గానీ సమ్మె విరమించేది లేదన్నారు. చివరకు పోలీసులు, స్థానిక నేతలు జోక్యం చేసుకుని అంగన్వాడీలకు సర్దిచెప్పారు. అనంతరం మంత్రి బొత్స తన వాహనంలో విజయనగరం వెళ్లారు.

# జగన్ పాలనలో అందరికీ కష్టాలే

**రైతులపట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు**

**మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపణ**



అనంతపురం,జనవరి8(( విభారె) : సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలవారు ఇబ్బంది పడినప్పటికీ ఎక్కువగా నష్టపోయింది రైతులేనని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఈ నాలుగేళ్ల 9 నెలల పాటు వైసీపీ ప్రభుత్వం రైతు సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కనీసం ఏ ప్రాంతంలో కూడా మంచి పంటలు తీసుకున్న పరిస్థితి కనిపించలేదన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ..రాజధాని అమరావతిని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో టిడిపి అధికారంలోకి వచ్చి, ప్రజా రాజధానిని నిర్మించి తీరుతుందని ఆమె స్పష్టం చేశారు. వైసీపీ నిర్వహిస్తున్న సర్వేల్లో కూడా వారికి వ్యతిరేకంగా ఫలితాలు వస్తున్నాయని ఇప్పటికే ఎమ్మెల్యేలంతా పార్టీని విడిచి వెళ్లిపోతున్నారని 2024లో వైసీపీ కనుమరుగు అవడం



ఖాయమన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగిందని, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కలిపి ఇచ్చే 15వేల రూపాయలతోనే మొత్తం అంతా ఏదో ఉద్ధరించినట్టు ప్రచారం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతివృష్టి, అనావృ ష్టితో రాష్ట్రంలోని అన్ని ప్రాంతా ల్లోనూ రైతులు పంటలు నష్టపోయా రని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో పాటు వ్యవసాయానికి, సాగుకు సంబంధి ంచి సరైన నిధులు కేటాయిం చకుండా ద్రోహం చేశారన్నారు.

## చంద్రబాబు దూరదృష్టితో అభివృద్ధి

**జగన్ పాలనలో దోపిడీకి తెర**

**ఆర్థిక వ్యవస్థ దివాళాతో అప్రతిష్ట**

**మండిపడ్డ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్**

అనంతపురం,జనవరి8 చంద్రబాబునాయుడు ఎంతో ముందు చూపుతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తే..జగన్ ధనయజ్ఞం చేస్తున్నారని టిడిపి సీనియర్ నేత ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. మద్యనిషేధం కాస్తా కాసులవేట పథకంగా మారిందన్నారు. ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిందన్నారు. ఇకపోతే గత ఐదేళ్లలో అభివృద్ధి ఆగిందని అన్నారు. ఒక్క రోడ్డు కూడా వేయలేని దుస్థితిని చూశామని అన్నారు. చంద్రబాబు హయాంలో రాయలసీమకు నీటి తరలింపు కోసం ముచ్చుమర్రి చేపట్టి నీటి తరలింపును సాకారం చేశారని అన్నారు. హంద్రీ-నీవా ద్వారా కుప్పంకు నీళ్లు ఇవ్వాలని లక్ష్యంతో పుంగనూరు నుంచి కుప్పం వరకు రూ.800 కోట్లు ఖర్చుచేసి కాలువలు, కల్వర్టులు, బ్రిడ్జిలు కట్టించారని తెలిపారు. పులివెందులకు గండికోట నుంచి నీళ్లు ఇచ్చినట్లు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మట్టి పనులు చేపట్టి జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారన్నారు. రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టులు చేపట్టిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు.గోదావరిలో 1000 టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని వాడుకుని రాయలసీమకు నీళ్లు తేవాలని పట్టిసీమ కడితే దానిపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. పట్టిసీమ ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చి పంటలు కాపాడిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదేనన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసే అవస్థలు లేకుండా ఆనాడు చర్యలు తీసుకున్న ఘనత చంద్రబాబుదని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి లబ్ధిదారునికి రేషన్‌కార్డులు, పింఛన్లు అందించిన ఘనత తెదేపాకే దక్కిందన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 09-01-2024


## ముందున్నది...మొసళ్ల పండుగ

ఛాయ్ తాగడం. సమోసాలు తినడం తప్ప ఆ కూటమి నేతలు చేసేదేమీ లేదు" అని ఆ మధ్య ఓ కీలక నేత ఇండియా కూటమిపై ఇలా సెటైర్లు వేశారు. పొలిటికల్ కామెంట్స్ ఇలానే ఉంటాయని అనుకున్నా...నిజంగా జరుగుతోంది అదే కావచ్చు అనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మరెన్నో నెలల సమయం లేదు. ఇప్పటి నుంచే యాక్టివ్ అయితే తప్ప మోదీ సర్కార్‌ని ఢీకొట్టడం సాధ్యం కాదు. అసలు ఈ పాటికే గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేసుకోవాలి. కానీ...ప్రతిపక్షాలు మాత్రం ఇంకా "ఏం చేద్దాం" అనే దగ్గరే ఆగిపోయినట్టు కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా తమ ప్రభావం చూపించాలను కుంటున్న పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి సరే...మరి తరవాతి సంగతేంటి..? ఇప్పటికి నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. కానీ ఇప్పటి వరకూ కూటమి నుంచి అధికారికంగా "ఇదీ మా ప్రణాళిక" అన్న ప్రకటన రాలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్ప మిగతా ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించినట్టే కనిపించడం లేదు. కూటమిలో అంతా బాగానే ఉండుంటే ఈ పాటికి సీట్‌ల షేరింగ్ విషయంలో ఓ స్పష్టత వచ్చుండేది. ఇక్కడే పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. సైద్ధాంతిక విభేదాలున్న తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు కలవడం అంటే అదో వింతే. అప్పట్లో బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు ఈ రెండు పార్టీల మధ్య ఎన్ని విభేదాలు తలెత్తాయో తెలియంది కాదు. కానీ కూటమి ఈ రెండు పార్టీలనూ ఒక్క చోటకు చేర్చింది. అది ఆ దశకే పరిమితమైంది. సీట్‌ల పంపకాల విషయంలో చిక్కులు వీడడం లేదు. కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కాస్త గట్టిగానే విమర్శలు చేశారు. "ఆమె మోదీకి సేవలు చేయడంలోనే సరిపోతున్నట్టుంది" అంటూ మండి పడ్డారు. అసలే ఉప్పు నిప్పు లాంటి పార్టీలు...చివరకి వరకూ ఎలా కలిసి ఉంటాయన్న అనుమానాలకు ఈ విభేదాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. ఇక్కడే మరో విషయమూ చెప్పుకోవాలి. "మాపై మీరు జాలి చూపించాల్సిన అవసరం లేదు" అని మమతా బెనర్జీపై కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి నేరుగానే విమర్శలు చేశారు. అంతే కాదు. సొంతగా పోటీ చేసి కూడా గెలిచి చూపిస్తాం అని తేల్చి చెప్పారు. అంటే...బెంగాల్‌లో సీట్‌ల పంపకాల్లో తేడాలు వస్తున్నట్టేగా. ఇక్కడొక్కచోటే కాదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లోనూ సీట్‌ల పంపకాల సమస్యని తేల్చడం అంత సులభమేమీ కాదు. మహారాష్ట్ర, బిహార్, యూపీ, వెస్ట్ బెంగాల్, పంజాబ్‌లో సీట్ షేరింగ్ విషయంలో చాలా ఆచితూచి వ్యవహరించాలని చూస్తోంది కాంగ్రెస్. అదే సమయంలో స్థానిక పార్టీలకు ఎక్కువ సీట్‌లు ఇచ్చేందుకు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ఈ డబుల్ గేమ్ వల్లే ఈ సమస్య కొలిక్కి రావడం లేదు. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో కనీస 15-20 సీట్లలో పోటీ చేయాలని చూస్తోంది కాంగ్రెస్. మహారాష్ట్రలో 48 ఉండగా అందులో 16-20 స్థానాల్లో, పశ్చిమ బెంగాల్‌లో 6-10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇది విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మాత్రమే. ఈ లెక్క పెరగొచ్చు కూడా. కానీ...తగ్గే అవకాశాలైతే కనిపించడం లేదు. ఆ మాత్రం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టకపోతే అసలు తాము పోటీ చేసి ఏం లాభం అనే వైఖరితో ఉంది కాంగ్రెస్. కానీ 2019 నాటి ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పార్టీలు కాంగ్రెస్‌కి అన్ని సీట్లు ఇచ్చేందుకు ముందుకు వస్తాయా లేదా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. యూపీలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీతో పెద్దగా విభేదాలైతే లేవు. ఒకవేళ అఖిలేష్ యాదవ్ ఒప్పుకుంటే యూపీలో కాంగ్రెస్‌కి పెద్దగా సవాళ్లు ఏమీ ఎదురుకాకపోవచ్చు. సీట్‌ల పంపకాలూ తొందరగానే పూర్తవుతాయి. కాంగ్రెస్‌కి ఉన్న సమస్యల్లా బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోనే. బిహార్‌లో ఆర్జేడీ జేడీయూ లాంటి స్థానిక పార్టీలదే హవా. తమకు బలం ఉన్న నియోజకవర్గాలను వదులుకుని కాంగ్రెస్‌కి ఛాన్స్ ఇస్తాయా అన్నది అంతు తేలని ప్రశ్న. అయినా కాంగ్రెస్ కోసం మేమెందుకు త్యాగం చేయాలన్న ఆలోచన వాళ్లలో వచ్చిందంటే హస్తం పార్టీకి చివరకు నాలుగైదు సీట్ల కన్నా ఎక్కువగా మిగలవు. అక్కడే పోటీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కాంగ్రెస్ ఒప్పుకోకపోవచ్చు. అటు మహారాష్ట్రలోనూ ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీకి, కాంగ్రెస్‌కి అసలు పొసగడం లేదు. కచ్చితంగా 20 సీట్లలో అయినా పోటీ చేస్తామని శివసేన మొండి పట్టుపడుతోంది. కాంగ్రెస్ కూడా దాదాపుగా అదే కోరుకుంటోంది. కానీ ఎవరి లెక్కలు వాళ్లకుంటాయిగా. పైగా అన్ని స్థానిక పార్టీలూ ఈ లోక్‌సభ ఎన్నికలని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. తనకు మాలిన ధర్మం ఎందుకన్న ధోరణిలోనే ఆలోచిస్తున్నాయి. పైగా కాంగ్రెస్‌కి సీట్‌లు ఇవ్వాలంటే గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎంత ఉందో అన్న లెక్కలు తీస్తున్నాయి. ఈ లెక్కల ఆధారంగా చూస్తే కాంగ్రెస్‌కి తక్కువ సీట్‌లే కేటాయించే అవకాశాలున్నాయి. ఖర్గే ఒక్కరే కాస్త ముందు పడి ఈ సీట్‌ల లెక్కల్ని తేల్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు కానీ...అటు ఆమ్ ఆద్మీ పార్టీతోనూ విభేదాలు పక్కన పెట్టి కలిసి నడవడం అంత సులువేమీ కాదు. పంజాబ్‌లో ప్రస్తుతం ఆప్ ప్రభుత్వమే ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కి మంచి క్యాడర్ ఉంది. అందుకే ఇక్కడ ఎక్కువ సీట్‌లలో పోటీ చేయాలని ఆశ పడుతోంది. కానీ...ఇప్పటికే అధికారంలో ఉన్న ఆప్ ఆ అవకాశం ఇస్తుందా అన్నది స్పష్టత లేదు. మరో 15-20 రోజుల్లో అంతా సెటిల్ చేసేస్తాం అని ఖర్గే చాలా ధీమాగా చెబుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇన్ని సమస్యలు ఎదురవుతుంటే ఖర్గే ఏ కాన్ఫిడెన్స్‌తో అలా చెబుతున్నారన్నది ఆసక్తికర విషయం.

## ప్రతి సచివాలయంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కునివాళులర్పించండి

### అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08- ప్రతి సచివాలయం లో 11వ తేదీ వరకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ పేర్కొన్నారు . మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, అడ్మిన్ సెక్రటరీఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు,వలంటీర్లు, ప్రజలు, సిబ్బంది డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళి అర్పించాలన్నారు. కార్యక్రమనిర్వహణకు బ్యానర్ చేయించాలనికార్యక్రమానికి హాజరైన వారి చేత ఈ బ్యానర్పై పర్మనెంట్ ఇంక్ మార్కర్ పెన్తో సంతకాలు చేయించాలన్నారు . అనంతరం ర్యాలీని నిర్వహించాలని అన్నారు . ప్రతి సచివాలయం నుంచి 10 మందిప్రజలను 19న విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధంచేయాలన్నారు. ఈ కార్యక్రమాలను సచివాలయాలఉద్యోగులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అలాగే ఈ రోజు మున్సిపల్ కార్యాలయం లో జరిగిన స్పందన కు ఒకే ఒక్క అర్జీ వచ్చిందని ఆయన తెలిపారు .

## నంద్యాల మండలం లో 173 కొత్త పింఛన్లు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08- నంద్యాల మండలం లో కొత్తగా 173 పింఛన్లు మంజూరు అయ్యాయని ఎమ్ పీ డీ ఓ తెలిపారు. పెన్షన్ల పంపిణీ ఎంపిడిఓ కార్యాలయం సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ . ఇప్పటివరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈ జనవరి ఒకటి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు . కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేసి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. వలంటీర్లు కూడా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను డబ్బులు అందజేయాలని కోరారు.. సీఎం జగనన్న తానిచ్చిన మాటను అమలుచేసి చూపించడంతో నేడు నంద్యాల మండలం లో కొత్తగా 173 పింఛన్లు మొత్తం 7118 మందికి పింఛన్ పత్రలను అందజేయడం జరిగిందన్నారు .ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్,ఎమ్ పి డి ఓ సుగుణశ్రీ,మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్ రెడ్డి,మరియు గ్రామ సర్పంచ్ లు ఎంపీటీసీ లు గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అలసిన బతుకులకు భరోసా వైయస్సార్ పెన్షన్ కానుక

**3000 రూపాయలు పెంచిన పింఛన్ పంపిణీ ఎమ్మెల్యే బాలనాగరెడ్డి.యువనేత ప్రదీప్ రెడ్డి.పురుషోత్తం రెడ్డి రామ్మోహన్ రెడ్డి.**



పెద్దకడబూరు జనవరి 08 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండల పరిధిలో కంబాలదిన్నె గ్రామంలో.... ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి.. ప్రదీప్ రెడ్డి పురుషోత్తం రెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు..ప్రతి ఇల్లు తిరుగుతూ.. 3000 రూపాయలు పెంచిన..పింఛను పంపిణీ కార్యక్రమానికి..రంగముని భీమరాయుడు..ప్రతి ఇల్లు తిరుగుతూ..ప్రతి ఇంట్లోనూ.. పింఛన్ తీసుకుని ప్రతి అవ్వ తాత అన్న.మామ అక్క చెల్లి.. ప్రతి ఒక్కరు నోట జీవితంలో ఎన్నో కష్టాలు చూసి..అలసిపోయిన బతకలకు. సీఎంజగన్మోహన్ రెడ్డి. ఎమ్మెల్యే బాలనాగరెడ్డి.. వైయస్సార్ పెన్షన్ కానుకతో భరోసా కల్పించారని.. .మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి..జగనన్నకు..రుణపడి ఉంటామని. .2019 ఎన్నికల్లో సమయం లో.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న పెన్షన్ 3000 రూపాయలు పెంచారని పెరిగిన పెన్షన్ వల్ల అవ్వ తాతలకు మంచి జరుగుతుందని... జగనన్నను బాలనాగరెడ్డిని మా జీవితంలో.. మర్చిపోము..మళ్లీ మళ్లీ జగనన్నే వస్తారు.. మంత్రాలయానికి ఎమ్మెల్యేగా బాలనాగ రెడ్డి గెలుస్తారు

## కర్నూలు నగర పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెవరెండ్ షాలేం రాజు ఎన్నిక.

విభారె న్యూస్ జనవరి 08 కర్నూలు.. కర్నూల్ నగరంలోని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెవరెండ్ వి. షాలెం రాజు ని ఎన్నుకున్నట్లు చీఫ్ ఫంక్షనరీ ఆర్.ఆర్.డి సజీవరాజు ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం నగరంలోని బుధవారపేట గుడ్ షెఫర్డ్ చర్చిలో ఏర్పాటుచేసిన పాస్టర్స్ అసోసియేషన్ సమావేశంలో నూతనంగా సిటీ పాస్టర్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని గతంలో పనిచేసిన కమిటీకి కాల పరిమితి ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెవరెండ్ వి. షాలేం రాజు, ఉపాధ్యక్షులుగా రెవ,జి. కిషోర్ కార్యదర్శి రెవ, ఆర్. దాసు,సహాయ కార్యదర్శి రెవరెండ్ పి.అబ్రోజ్, కోశాధికారి వీఎన్ రవికుమార్,సహాయ కోశాధికారి రెవరెండ్ డి.జయ కుమార్ లతోపాటు రెవరెండ్ సిహెచ్ రవీంద్ర రెవ,కిరణ్ కుమార్, రెవ.ఎస్.జాన్ బెన్హర్ లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు.



## పెద్దకడబూరు గ్రామానికి శ్రీమతి నారా భువనేశ్వరి గారి రాక!!



పెద్దకడబూరు జనవరి08 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంరాష్ట్ర తెలుగు రైతు అధికారప్రతినిధి. నరవ రమాకాంత రెడ్డి,మాట్లాడుతూ మన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్టును చూసి తీవ్ర మనస్థాపానికి గురై ,20 రోజులైనా బేలు రాకపోవడంతో గుండె ఆగి చనిపోయిన హరిజన గోనుపాడు గోపాల్ కుటుంబాన్ని పరామర్శించాలని ఉద్దేశంతో పెద్దకడబూరు గ్రామం వస్తున్నారు. దయచేసి అందరు హాజరై పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాను. బుధవారం రోజు ఉదయం 10 గంటలకు పెద్దకడుబూరు గ్రామం చేరుకుంటారు. ఆదోని నుంచి వస్తున్నారు కాబట్టి ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాల్సిందిగా కోరుచున్నాను

## కోట వీధిలో పలువురు బీజేపీ లో చేరిక

### అభిరుచి మదు నంద్యాల అసెంబ్లీ కన్వీనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08- నంద్యాల పట్టణం కోటవీది లో యువకులు స్వచ్ఛందంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు. ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలనకు ఆకర్షితులై బీజేపీ పట్టణ అధ్యక్షులు కశెట్టి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు సమక్షంలో చేరారు. అభిరుచి మదు మాట్లాడుతూ పట్టణంలో మంది బీజేపీ పార్టీ లో చేరుటకు ఉత్సాహం చూపుతున్నారనిఆయనఅన్నారు.కార్యక్రమంలోఎంపిటిసి భగవాన్. స్వాతి.గంగాధర.బాలు.మధు గురు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల తాలూకా రూరల్ సీఐ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్ .శివకుమార్ రెడ్డి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08 నంద్యాల రూరల్ సీఐ గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎన్. శివ కుమార్ రెడ్డి. అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ని పోలీసు కార్యాలయం నందు పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు . సీఐ ఎన్ శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ బదిలీలో భాగంగా చిత్తూరు జిల్లా సత్యవేడు నుంచి నంద్యాల కు బదిలీ అయ్యానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు .

## మున్సిపల్ కార్మికులు పట్టణంలో భిక్షాటన




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08 నంద్యాలలో మున్సిపల్ పారిశుద్ధ కాంట్రాక్ట్ కార్మికులు ఆరవ రోజు సమ్మె లో భాగంగా పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనువాసులు అధ్యక్షులు భూమిని శ్రీనివాసులు మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ ప్రతాప్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులతో పని చేయించుకోవడం తెలుసు గాని పనికి తగ్గ వేతనం ఇచ్చే దానిలో నిర్లక్ష్యం వహిస్తుందిదని విమర్శించారు. నంద్యాలలో గత ఆరు రోజుల నుండి మా సమస్యల పరిష్కారం కొరకు సమ్మె నిర్వహిస్తుంటే మున్సిపల్ అధికారులు బయట నుండి ప్రైవేటు వ్యక్తులను పట్టణంలో దింపి వారితో పనులు చేపిస్తుంటే మేము అడ్డుకోవడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు లు ఇటువంటి చర్యలకు పాల్పోవడం మంచిది కాదని అన్నారు.

# కోడి పందాల కోసం విదేశీ పుంజులు



కాకినాడ, జనవరి 8, దేశవాళీ కోడిపుంజులకు ధీటుగా ఈసారి కోడిపందాల బరిలో విదేశీ జాతులైన పెరు కోడిపుంజులను దింపుతున్నారు పందెం రాయుళ్లు. దేశవాళీ కోడిపుంజుతో పోలిస్తే విదేశీ జాతికి చెందిన పుంజులు అధిక పోరాట పటిమ కలిగి ఉంటాయని పందెం రాయుళ్లు చెబుతున్నారు. పెరు జాతులను ప్రత్యేకంగా ఎలా పెంచుతారు?వాటి పెంపకానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి.. దేశవాళీ కోడిపుంజుల పెంపకం మాదిరిగానే పెరు కోడిపుంజుల పెంపకం ఉంటుందా ?? మన వాతావరణ పరిస్థితుల్లో అవి ఎంతవరకు జీవించగలవు.. అనే విషయాలపై పందెం రాయుడు ఇప్పటికే సమగ్రంగా తెలుసుకున్నారు.దేశవాళీ కోడి పుంజులు 22 అంగుళాల ఎత్తు నుంచి 26 అంగుళాల ఎత్తు వరకు ఉండి నిటారైన ఆయన తోకతో పోడవాటి కాళ్లను కలిగి ఉంటాయి. కానీ పెరు జాతి కోడిపుంజు 16 నుంచి 20 అంగుళాల ఎత్తు మాత్రమే ఉండి తోక భూమికి వంగి ఉండటంతో పాటు ఆకారంలో పోలిస్తే దేశవాళీ కోడిపుంజు కన్నా పెరు జాతి కోడిపుంజు చిన్నదిగా ఉంటుంది. అయితే బలాల విషయానికొస్తే పెరు కోడిపుంజు కన్నా దేశవాళీ కోడిపుంజే బలిష్టంగా ఉంటుందని పందెం రాయుళ్లు చెబుతున్నారు. కానీ పోరాట పటిమ విషయానికి వస్తే పెరు జాతి కోడిపుంజు స్పీడుగా పోటీలో దింపిన వెంటనే ప్రత్యర్థి కోడి పుంజుపై వేగంగా వెళ్లి తన పోరాట పటిమను కనబరుస్తుంది. అంతేకాక ఆకారంలో చిన్నగా ఉండటం, బరువు తేలికగా ఉండటంతో పందెంబరిలో ప్రత్యర్థి కోడిపుంజుకు చిక్కకుండా పోరాడి విజయాన్ని సాధిస్తుంది. దాంతో ఇటీవల ఎక్కువగా పందెం రాయుళ్లు సంక్రాంతి కోడి పందాల కోసం పెరు కోడి పుంజులనే ఇష్టంగా పెంచుతున్నారు.ఇక ప్రత్యేకంగా సిద్ధం చేసిన పందెం పుంజులతో పందెం రాయళ్లు ఇప్పటికే పందాల కోసం సిద్ధమయ్యారు. అయితే ఈసారి పందెం పుంజుల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. ప్రత్యేకంగా తయారుచేసిన పందెం పుంజు ధర ప్రస్తుతం సుమారు ఒక లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల వరకు పలుకుతుంది. అయితే పందాలు కూడా అంతే స్థాయిలో జరుగుతుతాయి. ఒక్కొక్క కోడి పందాన్ని తలపడే కోడిపుంజులను బట్టి లక్ష రూపాయలు నుంచి 50 లక్షల వరకు పందేలు కడతారు. పందాలలో తలపడే పందెం కోళ్ల ప్రత్యేక తయారీకి ఒక్కొక్క కోడికి సుమారు 25 వేల నుంచి 50 వేల వరకు ఖర్చవుతుంది. ఇక విదేశీ కోళ్లకైతే ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడంతో మరింత ఖర్చు ఎక్కువవుతుంది. ఎందుకంటే వాటి పెంపకానికి తగిన వాతావరణ పరిస్థితులు కల్పించడానికి మరింత అదనంగా ఖర్చవుతుంది. ఈ పందాలు ఒక్క గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే కాకుండా పట్టణంలో నివసించేవారు, సినీ రాజకీయ ప్రముఖులు సైతం ఎక్కువగా పాల్గొనడంతో కోడిపందాలపై ఎంతో క్రేజ్ పెరిగిపోయింది.పందెం రాయుళ్లు పుంజులను బట్టి, జాతిని బట్టి, రంగును బట్టి, కొందరైతే నక్షత్రాలను బట్టి సైతం పెద్ద ఎత్తున పందేలు కాస్తుంటారు. పండగ మూడు రోజులు ఒక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మారు 250 నుంచి 300 కోట్ల రూపాయలు చేతులు మారుతాయి అని అంచనా వేస్తున్నారు. ఓ పక్క పందాల బరిలో కోడిపందాలతో పాటు గుండాట, పేకాట జోరుగా సాగుతాయి. అంతేకాకుండా కోడిపందాల వీక్షణ కోసం వచ్చే పందెం రాయుళ్ల కోసం బరుల వద్ద ప్రత్యేకమైన వంటకాలు, రకరకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా పందెంబరుల వద్ద కోజా మాంసాన్ని ఎక్కువగా తింటారు. పందెంలో ఓడిపోయిన పుంజుని కోజా అంటారు. అలాంటి కోజా పుంజులతో ప్రత్యేక వంటకాలు చేస్తారు.

# సొంతూరుకు రఘురామరాజు

ఏలూరు, జనవరి 8,సాధారణంగా సొంత గ్రామంలో నేతలు సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందునా గోదావరి జిల్లాల్లో అయితే ఆ సందడే వేరు. తాము ఎక్కడ ఉన్నా సంక్రాంతి ఆ నాలుగు రోజులు స్వగ్రామాల్లో గడపడం ఆనందంగా ఫీలవుతారు. అటువంటిది వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు గత నాలుగు సంవత్సరాలుగా సంక్రాంతి నాడు సొంత గ్రామానికి దూరమయ్యారు. సొంత పార్టీని, సొంత ప్రభుత్వాన్ని, అధినేతను ధిక్కరించడంతో సొంత నియోజకవర్గాన్ని సందర్శించాలంటే సవాలక్ష నిర్బంధాలు ఎదుర్కొన్నారు. పోలీస్ కేసులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే ఎన్నికలు ముంగిట ఈ సంక్రాంతి మాత్రం నరసాపురంలోనే జరుపుకోవాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారు.గతంలో చాలాసార్లు నరసాపురం వెళ్లేందుకు రఘురామకృష్ణంరాజు ప్రయత్నించారు. కానీ పోలీసులు ఎన్ని కేసులు పెట్టారో తెలియడం లేదు. రహస్యంగా ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారో బయట పెట్టడం లేదు. రాత్రికి రాత్రి అరెస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి.



ఓసారి పుట్టినరోజు అని కూడా చూడలేదు. హైదరాబాద్ వెళ్లి గుంటూరు తీసుకొచ్చి మరీ థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఏకంగా రాజద్రోహం కేసు పెట్టి రఘురామకృష్ణంరాజుకు నరకం చూపించారు. అందుకే చాలాకాలంగా ఢిల్లీ, హైదరాబాద్ కి ఆయన పరిమితం అయ్యారు. కానీ ఆయన కుమారుడు మాత్రం నియోజకవర్గానికి వెళ్లి పనులన్నీ చక్కబెడుతున్నారు.వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయాలని రఘురామకృష్ణంరాజు భావిస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీతో జనసేన జతకట్టింది. బిజెపి కూడా కలిసి రానుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా రఘురామకృష్ణం రాజు ఎంపీగా పోటీ చేస్తారని టాక్ నడుస్తోంది. అందుకే ఈ సంక్రాంతికి నరసాపురం రావాలని రఘురామరాజు డిసైడ్ అయ్యారు. ఎన్నికల ముంగిట మరోసారి ఏపీ ప్రభుత్వం ఇబ్బంది పెడితే అది రాజకీయంగా వారికే నష్టం జరుగుతుందని అంచనాకు వచ్చారు.ఎప్పుడూ సంక్రాంతికి సొంత గ్రామంలో ఉండడం రఘురామరాజు ఆనవాయితీగా చేసుకున్నారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా వైసీపీ సర్కార్ ఉక్కు పాదం మాపడంతో సొంత ప్రాంతంలో అడుగుపెట్టలేకపోయారు. ఇప్పుడు ఎన్నికల ముందు పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తే అది అంతిమంగా రఘురామకే ప్లస్ అవుతుంది. అందుకే ఈసారి ధైర్యంగా నరసాపురంలో అడుగు పెట్టేందుకు రఘురామకృష్ణంరాజు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఏపీలో మేనిఫెస్టో వార్

విజయవాడ, జనవరి 8, ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. సంక్రాంతి తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీలు వ్యూహాల రూపొందించుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి. సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని జగన్ నమ్మకంగా చెబుతుండగా.. ప్రభుత్వ వైఫల్యాలే తమను గెలిపిస్తాయని టిడిపి, జనసేన ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.ఇప్పటికే ఉన్న సంక్షేమ పథకాలకు తోడు.. అదనంగా కొన్ని అంశాలతో మేనిఫెస్టో ప్రకటించాలని జగన్ కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆరు పథకాలతో టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రకటించింది. త్వరలో జనసేనతో కలిసి ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటనకు కసరత్తు చేస్తోంది. మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి.. వారి అభిమానాన్ని చురగొనాలని ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను తీసుకొచ్చింది. దీనిలో నిరుద్యోగులు, మహిళలు, రైతులకు పెద్దపీట వేశారు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి కూడా అండగా ఉన్న బీసీలకు కూడా ఈ మేనిఫెస్టోలో స్థానం కల్పించారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు మహాశక్తి పేరుతో పథకాన్ని తీసుకొస్తామని చెప్పుకొస్తున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపడుచుకి స్త్రీ నిధి కింద నెలకు 1500 రూపాయలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారు. దీంతో పార్టీ తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ.. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000 అందించేలా పథకాన్ని ప్రకటించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ లను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం కింద స్థానిక ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ టిక్కెట్ లేని ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.మినీ మేనిఫెస్టోలో భాగంగా చంద్రబాబు రిచ్ టు పూర్ అనే పథకాన్ని ప్రవేశపెట్టారు.ఈ పథకంలో పేదలను సంపన్నులు చేసే విధంగా టిడిపి, జనసేన ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ప్రకటించారు. ఐదేళ్లలో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రకటించారు. వైసిపి హయాంలో 26 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారు. 650 మంది నాయకులు పై తప్పుడు కేసులు పెట్టారు. రాష్ట్రంలో 43 మందికి పైగా ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని టిడిపి బీసీలకు రక్షణ చట్టాన్ని ప్రకటించింది. అటు రాష్ట్రంలో అన్నదాత పథకం కింద రైతులకు పదిహేను వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించాలని కూడా నిర్ణయించింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు 2500 రూపాయలను అందించనున్నట్లు ప్రకటించింది.అయితే ఇప్పటికే నవరత్నాల రూపంలో అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వైసీపీ చెబుతోంది. అయితే కీలకమైన మద్య నిషేధం ఏమైనట్టు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నవరత్నాల్లో మద్యాన్ని నిషేధిస్తామని జగన్ స్పష్టం చేశారు. స్పష్టమైన ప్రకటన చేశారు. కానీ అమలు చేయలేకపోయారు. సిపిఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులు హామీ ఇచ్చారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని కూడా చెప్పుకొచ్చారు. పెద్ద ఎత్తున ఉ ద్యోగాలు భర్తీ చేస్తానని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఏ ఒక్కటీ చేయలేకపోయారు. పైగా ఉద్యోగులకు ఉన్న రాయితీలను సైతం నిలిపివేశారు. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసే సమయంలో చాలా వర్గాలకు ఎన్నో రకాల హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోయారు. కేవలం బటన్ నొక్కడానికి పరిమితమయ్యారన్న విమర్శ ఉంది.అటు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పై ప్రజల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. గత ఎన్నికల ముందు జగన్ ప్రకటించిన నవరత్నాలు అంత స్పీడుగా ప్రజల్లోకి వెళ్ళలేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో సైతం నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటి విషయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. దీంతో ప్రజలకు చంద్రబాబుపై ఒక రకమైన అపనమ్మకం ఏర్పడింది. ఆ ప్రభావం మినీ మేనిఫెస్టో పై పడింది. గెలుపు కోసం ఎత్తుగడ మాత్రమేనని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్న హామీ మాత్రం బాగుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలు ఒక స్టంట్ గానే ఎక్కువమంది అభివర్ణిస్తున్నారు. పాలనాపరంగా చంద్రబాబుకు, సంక్షేమ పథకాల పరంగా జగన్ కు ప్రజలు మద్దతు తెలుపుతుండడం విశేషం.

# 3వ లిస్ట్ కోసం...మూడెదవరికి

విజయవాడ, జనవరి 8, సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మహిళలు, యువత, కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. ఏపీలో పొలిటికల్ హీట్ నెలకొంది. ఎన్నికల వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. అవకాశాలు దక్కని వారు ప్రత్యామ్నాయల కోసం వెతుక్కుంటున్నారు. పార్టీల నుంచి వీడడం, వేరే పార్టీలో చేరడం శరవేగంగా జరిగిపోతున్నాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో వైసీపీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ మార్చింది. ఇప్పుడు తుది జాబితాకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కసరత్తు పూర్తయింది. ఈ సాయంత్రానికి జాబితా వెలువడే అవకాశం ఉంది.సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మహిళలు, యువత, కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. మలి జాబితాలో అన్ని కులాల వారి ప్రాతినిధ్యం ఉండేలా చూసుకున్నట్లు తెలుస్తోంది. మూడో విడత జాబితా పై దాదాపు కసరత్తు పూర్తయినట్లు సమాచారం. కొద్దిపాటి చేర్పులు మార్పులు చేస్తూ వైసీపీ అగ్రనాయకత్వం 25 మంది పేర్లతో ఈ జాబితాను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రధానంగా అనంతపురం, సత్య సాయి పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాపు రామచంద్రారెడ్డికి ఈసారి టిక్కెట్ దక్కదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆయన సమాచారం అందుకొని పార్టీకి రాజీనామా కూడా చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ మూడో జాబితాలో రాయదుర్గం ఇన్చార్జి పేరును ప్రకటించే అవకాశం ఉంది. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం లో కూడా మార్పులు ఉన్నట్లు సమాచారం. అక్కడ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటికే వైసీపీ అగ్రనాయకత్వం ఆయనకు టిక్కెట్ ఇవ్వడం లేదన్న సమాచారం అందించినట్లు తెలుస్తోంది. కనీసం కర్నూలు లోక్ సభ స్థానానికైనా తన పేరును పరిశీలించాలని జయరాం కోరుతున్నట్లు సమాచారం. ఒకవేళ వైసీపీ నాయకత్వం మొండి చేయి చూపితే గుమ్మనూరు జయరాం పార్టీ నుంచి బయటికి వెళ్లే అవకాశం ఉంది. షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే వైసీపీ మూడో విడత జాబితా పెను ప్రకంపనలకు దారి తీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది

# కోనసీమలో పార్టీల కాక

కాకినాడ, జనవరి 8, స్వాతంత్ర్య సమరయోధుడు కళా వెంకట్రావు ప్రాతినిధ్యం వహించిన కొత్తపేట నియోజకవర్గానికి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే ఓ ప్రత్యేకత ఉంది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక 1955లో కొత్తపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పటినుంచి ఎక్కువ సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతూ రాగా 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతూ వస్తోంది.. కొత్తపేట నియోజకవర్గంలో చిర్ల కుటుంబం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండగా టీడీపీ నుంచే చిర్ల సోమసుందర రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన కుమారుడు చిర్ల జగ్గిరెడ్డి 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యి 2014, 2019లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.. ఇటీవల భరోసా యాత్రలో భాగంగా రావులపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ అధినేత, మాజీముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు చిర్ల జగ్గిరెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చిల్లర జగ్గిరెడ్డి అంటూ సంభోదిస్తూ ఇసుక దోపిడీ చేస్తున్నారంటూ, కాంట్రాక్టులు తీసుకుని దోచేస్తున్నారని, భూ కబ్జాలు చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.. 2014, 2019 ఎన్నికల్లో తిరుగు లేని విజయాన్ని సంపాదించిన జగ్గిరెడ్డి మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో వైసీపీని ఓడించాలన్న లక్ష్యంతో టీడీపీ, జనసేన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి.. ఇప్పటికే టీడీపీ తరపున నియోజకవర్గ ఇంచార్జ్ బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావులు పోటాపోటీగా ఈసారి గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.. అయితే ఈసారి టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఏపార్టీ పోటీచేస్తుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఎవ్వరికి వారు తమ పని తాము చేసుకుపోతూ ప్రజల్లో తమ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు..వైసీపీ గెలుపు కోసం ప్రభుత్వ విప్, కొత్తపేట సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి కూడా గెలుపు ద్వారా హ్యాట్రిక్‌ను సాధించాలని చిర్ల తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారట.. ఇందుకోసమే వైసీపీకు సాంప్రదాయ ఓటింగ్‌గా ఉన్నఎస్సీ,బీసీఓటర్లతోనిరంతరంటచ్‌లోఉంటూచెక్కుచెదరని ఓటుబ్యాంకుతో విజయంసాధించాలనిపట్టుదలతోపనిచేసుకుపోతున్నారన్నప్రచారం సాగుతోంది.. అయితే రావులపాలెంలో చోటుచేసుకున్న పలు వివాదాలు, అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా మోకాలడ్డారన్న ఆరోపణలు ఎస్సీ సామాజిక వర్గాన్నికొంతవరకు చిర్లజగ్గిరెడ్డికిదూరంచేశాయన్న మాటలు వినిపిస్తున్నాయి.. ముఖ్యంగా అంబేడ్కర్ చిత్రపటంతో ఉన్న పేపర్ ప్లేట్స్ వివాదంలో ఓ వర్గానికి కొమ్ముకాసి దళిత యువకులను తిరిగి జైల్లో పెట్టించారని ఆరోపణలు చిర్లపై తీవ్రంగా ఉన్నాయి.. ఇదే సమయంలో కాపు సాసమాజిక వర్గాన్ని కాపు కాసుకుంటూ అదే సమయంలో ఎస్సీ వర్గీయుల్లో పట్టుసాధించాలన్న పట్టుదలతో బండారు సత్యానందరావు నిమగ్నమయ్యారన్నది కూడా వినిపిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన శాసన మండలి మాజీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి కూడా కోనసీమ ప్రాంతంలో టీడీపీ నుంచి కీలకంగా పనిచేస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సుబ్రహ్మణ్యం ద్వారా కూడా బీసీ వర్గం నుంచి టీడీపీకు అనుకూల ఓటు బ్యాంకు లభిస్తే ఇక టీడీపీ, జనసేన పొత్తుతో విజయం తథ్యం అన్న ధీమాతో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది.. కొత్తపేట నుంచి శాసన సభకు ప్రాతినిధ్యం వహించిన వారి జాబితా పరిశీలిస్తే.. 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన చిర్ల జగ్గిరెడ్డి టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుపై 2,271 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భాంతో ఇక్కడ ముక్కోణపు పోటీ జరిగింది. పీఆర్పీ నుంచి బండారు సత్యానందరావు, కాంగ్రెస్ నుంచి చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ నుంచి రెడ్డి సుబ్రహ్మణ్యం లు తలపడ్డారు. ప్రజారాజ్యం నుంచి పోటీచేసిన బండారు సత్యానందరావు జగ్గిరెడ్డిపై 2,470 ఓట్లుతో గెలుపొందారు.. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సత్యానందరావు, జనసేన అభ్యర్థి బండారు శ్రీనివాసరావులపై 4,038 ఓట్లు మెజార్టీ సాధించిన జగ్గిరెడ్డి విజయం సాధించారు. మొత్తం 2004 నుంచి పరిశీలిస్తే కొత్తపేటలో ఏ పార్టీకు అయినా స్వల్ప మెజార్టీ మాత్రమే లభిస్తుందన్నది తెలుస్తుంది.

# కంపుకొడుతున్న బస్తీలు



తిరుపతి, జనవరి 8, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛతే కరువైంది. బస్తీల్లో ఎటు చూస్తే అటు పేరుకుపోయిన చెత్త కుప్పలు. ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం, చెత్త కుండీలు నిండిపోయి రోడ్డుపై చెల్లా చెదురుగా పడి ఉన్న చెతను పందులు, వీధికుక్కలు మరింత చిందరవందర చేస్తుండడంతో ఆ దారిలో వెళ్లాలంటేనే భయమేస్తోంది. దోమల బెడద సరేసరి. ఇది రాష్ట్రంలో ఎక్కడో ఉన్న బస్తీల సంగతి కాదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసానికి కూత వేటు దూరంలో ఉండే చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల పరిస్థితి. ఇక్కడే ఇటువంటి పరిస్థితి ఉంటే, రాష్ట్రంలో మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈపరిస్థితి కొనసాగితే అంటు వ్యాధులు విజృంభించి రాష్ట్రం రోగాంధ్రప్రదేశ్‌గా మారే ప్రమాదముందని, కరోనా మళ్లీ తలెత్తుతున్న స్థితిలో ఇది విపత్కర పరిణామాలకు దారి తీసే ప్రమాదముందని ప్రజారోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు26 నుంచి మున్సిపల్ వర్కర్స్ చేస్తున్న సమ్మెను పరిష్కరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అందునా సంక్రాంతి పండగ దగ్గర పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బెట్టు వీడి సమ్మెను పరిష్కరిస్తే మంచిదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరుతున్నారు. 14 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ప్రధానమైన డిమాండ్లను అంగీకరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. సమ్మెను విఫలం చేసేందుకు పోటీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రంగంలోకి దింపాలని చూసింది. పోటీ కార్మికులు కూడా సమ్మెకు దిగారు. టన్నులకొలది పోగుపడుతున్న చెత్త ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు దర్పణం పడుతున్నాయి.గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి) పరిధిలో ప్రతి రోజూ 845 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. సమ్మె ప్రారంభమైన నాటినుంచి దాదాపు 2,500 టన్నులుచెత్తపోగయింది. దీనిలో 1,200 టన్నులచెత్తనుమాత్రమే అధికారులు తొలగించగలిగారు. జివిఎంసి పరిధి లో 990మంది పర్మినెంట్, 4,900 అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెలో ఉన్నారు. పర్మినెంట్ కార్మికులతో అధికారులు చెత్తను తీయిస్తున్నారు.గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 800 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. 300 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం 110 నుంచి 150 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 120 మెట్రిక్ టన్నుల చెత్తపోగవుతోంది.పర్మినెంట్ కార్మికులద్వారా ప్రసుత్తం 25 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది విజయన గరంలో 480 మంది కార్మికులు సమ్మెలో ఉండటంతో ఎక్కడి చెత్త అక్కడే పోగుపడుతోంది. మరోవైపు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురికి నీరు ప్రధాన వీధుల్లోకి ప్రవహిస్తున్నాయి. నగరంలోని 50 డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొంది

## టీ వి.ప్రసన్న లక్ష్మి జ్ఞాపకార్థం..సాయం అందించిన ఎంఈఓ మధుసూదన్ రాజు..



విభారె న్యూస్ జనవరి 09 ఎమ్మిగనూరు..కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన స్వర్గీయ శ్రీ టీ వి.ప్రసన్న లక్ష్మి జ్ఞాపకార్థం వారి భర్త ఎంఈఓ మధుసూదన్ రాజు సహకారంతో వేదాస్ స్వచ్ఛంద సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక వివర్స్ కాలనీలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహానికి తమ వంతుగా 30 వేల రూపాయల విలువైన అడ్జస్ట్ డబుల్ మంచము ,వీల్ చైర్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా వేదాస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కదిరి కోట సునిల్ కుమార్ మాట్లాడుతూ టీ వి.ప్రసన్న లక్ష్మి కి నివాళులర్పించి ఎమ్మిగనూరు మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ కి ధన్యవాదములు తెలియజేశారు. పట్టణంలో ఎక్కడైనా నిరాశ్రయులు ఒంటరి మహిళలు అనాధ బాలబాలికలు ఎవరు తరసపడినా తమ దృష్టికి తీసుకురావాలని వారిని ప్రేమతో అక్కున చేర్చుకుంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ వి.యం. రవికుమార్, విద్యార్థి సంఘం నాయకులు ఆఫ్రిద్,రఘు, వేదాస్ సభ్యులు పాల్గొన్నారు.

APPSC

## గ్రూప్ 2 ఉద్యోగాలకు ఉచితంగా శిక్షణ

విభారె న్యూస్ జనవరి 09 ఎమ్మిగనూరు. నిరుద్యోగులైన ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ గ్రూప్ 2 పోస్టులకు సంబంధించి ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు అర్.ఎం.కె కోచింగ్ డైరెక్టర్ శ్రీమతి ఆశలుక్మన్ తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇందుకు అర్హులని తెలుపారు. దీనికి సంబంధించి అభ్యర్థులు ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్టీసి బస్ స్టాండ్ ఎదురుగ వున్న ఆర్ఎంకే కోచింగ్ సెంటర్లో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ దాదాపు 40 రోజులు వరకు వుంటుందన్నారు. క్రిస్టియన్లు, ముస్లిం, దూదేకుల, బమీపీ, బుద్దిస్ట్, జైన్స్, సిక్కు, పార్సీస్ మొదలగు విద్యార్థులందరూ తమ ఆధార్ కార్డ్, టెన్త్ మార్క్ లిస్ట్, క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫోటో లు, బ్యాంక్ అకౌంట్ నంబర్ లతో పాటు గ్రూప్ 2 ఆన్ లైన్ అప్లికేషన్ తో కోచింగ్ సెంటర్ నందు దరఖాస్తును మంగళవారం నుంచి చేసుకోవాలని తెలిపారు. జనవరి 11 వ తారీఖు నుండి పరిమిత సీట్లతో తరగతులు ప్రారంభమౌతుందని తెలిపారు.

## గంజాయి నీ అరికట్టాలి. -విద్యార్థి,ప్రజా సంఘాలు..



విభారె న్యూస్ జనవరి 08 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా అవడంవల్ల విద్యార్థి యువత తీసుకొని బానిసలుగా మారి వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని దీనిని అరికట్టాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతరామయ్య కి విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు పిడిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్ , యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఎంపీజె జిల్లా అధ్యక్షుడు ఖదీర్, ఐ వై ఎం పట్టణ అధ్యక్షుడు ఇస్మాయిల్ , పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ లు వినతీ పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణం అంటే స్వేచ్ఛకు ప్రశాంతతకు నిలయంగా ఉన్నటువంటి ఈ ప్రాంతంలో మత్తు పదార్థాలైన గంజాయి వంటీవి విచ్చలవిడిగా సరఫరా కావడం వలన చాలామంది విద్యార్థులు యువత వాటిని తీసుకొని అనేక రకాల వ్యసనాలకు బానిసలై గొడవలకు దిగుతూ చివరికి ప్రాణాలు బలి తీసుకుంటున్నారు గంజాయి మహమ్మారి బారినపడి చాలామంది యువత బలవుతున్నారు కావున వీటిని అరికట్టాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ ,ఆకాష్, రఘు, అభి తదితరులు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమానికి వచ్చిన 124 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం..

విభారె న్యూస్ జనవరి 08 కర్నూలు (జిల్లా ప్రతినిధి).. జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూలు,కోత్తపేటలోని కర్నూలు టు టౌన్ పోలీసుస్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి. సర్కార్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 124 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) హైదరాబాద్ లోని డిలైట్ కంపెనీలో డీవోప్స్ ఉద్యోగం ఇప్పిస్తానని కడప జిల్లా కు చెందిన ఆవూరి వెంకటేష్ సీనియర్ ఎక్సిపిరియన్స్ ఉందని టెలిగ్రాం యాప్ లో పరిచయం చేసుకుని ఫోన్ పే ద్వారా రూ. 25 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు గణేష్ నగర్ కు చెందిన జనార్ధన్ ఫిర్యాదు చేశారు. 2) నందవరం మండలం, మిట్ట సోమపురం గ్రామ శివారులో ఉన్న మా పొలంలో పండిన పత్తి, మిరప పంటను మరియు పైపులు,మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు టౌన్ కి చెందిన శేషన్న ఫిర్యాదు చేశారు. 3) తుకారం అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి మునగాల పాడు గ్రామ పరిధిలోని లక్ష్మీ మెగా టౌన్ షిప్ లోని ప్లాట్లకు 2008 సంవత్సరం నుండి కంతుల ప్రకారం డబ్బులు కట్టించుకుని కంతులు పూర్తయిన తర్వాత రసీదులు తీసుకుని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేస్తున్నాడని కర్నూలు, ఇందిర గాంధీ నగర్ కు చెందిన వీరన్న,ఎల్లప్ప లు ఫిర్యాదు చేశారు. 4) కర్నూలు కు చెందిన లతీఫ్ అనే వ్యక్తి గవర్నమెంట్ స్కూల్ లేదా కళాశాలలో క్లర్క్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, రూ. 3 నుండి 4 లక్షల ఖర్చు అవుతుందని అడ్వాన్స్ క్రింద రూ. 20 వేలు తీసుకుని మోసం చేశాడని హోళగుంద మండలం కు చెందిన జైబుల్లా ఫిర్యాదు చేశారు. 5) మా నాన్న షేక్ అన్వర్ టాటా ఏ సిఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. మా నాన్నను గుర్తు తెలియని వ్యక్తులు చంపుతామని నాకు ఫోన్లు చేస్తూ 60 వేలు ఇవ్వాలని బెదిరించారు. నేను పే టిఎంలో రూ. 60 వేలు లోను తీసుకుని యు పి ఐ ఐ డి ద్వారా వారికి పంపిచానని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కర్నూలు , ఖండేరి వీది కి చెందిన షేక్ మహమ్మద్ గౌస్ ఫిర్యాదు చేశారు. 6)ఆస్తిలో భాగం



అడిగినందుకు నా పై దాడి చేసి మానసికంగా, లైంగికంగా వేధిస్తున్న వ్యక్తు ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సి.బెలగల్ మండలం, పలుకుదొడ్డి గ్రామానికి చెందిన బోయ ఈరమ్మ ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి. సర్కార్ హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు, సిఐలు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు సౌకర్యం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి..



సిఐటియు ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆటో కార్మికులు.



తాసిల్దార్ కు వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు ఆటో కార్మికులు

విభారె న్యూస్ ఎమ్మిగనూరు జనవరి 8. ఉచిత బస్సు సౌకర్యం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సి గోవిందు బి.రాముడు ఏపీ రైతు సంఘం నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆటో,ట్రాలీ,అండ్ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు రాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. తాసిల్దార్ ఆంజనేయులు కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మంచిదే, కానీ దీనివల్ల ఆటో,ట్రాలీ,క్యాబ్,ఫోర్ వీలర్స్ డ్రైవర్లు కార్మికుల జీవితాలు సంగతి ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం ప్రకటించే లోపుగా ఆటో డ్రైవర్లు బ్రతుకులు బాగుపడటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని వారికి ప్రత్యామ్నాయ ఆర్థిక సహకారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల జీవనం కోసం నెలకు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే జీవో నెంబర్ 21 వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వము వాహన మిత్ర ద్వారా ప్రస్తుతం పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని వారు పేర్కొన్నారు. వాహన మిత్రను 20 వేల రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్రోలు, డీజిల్,గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటయని వీటి భారాన్ని మోయలేని పరిస్థితి ఈ ప్రభుత్వాలు కల్పించటం వల్ల ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా కోలుకోని పరిస్థితి ఏర్పడిందని వారన్నారు. ఇప్పటికైనా డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఆటో డ్రైవర్లకు సబ్సిడీ రూపంలో ఇవ్వాలని కోరారు. ఇంతేకాక ట్రాఫిక్ పోలీసులు,ఆర్టీవో సిబ్బంది ఏ చిన్న తప్పు జరిగిన వేలకు వేలు రూపాయలు ఫైండ్ల రూపంలో ఆటో డ్రైవర్లకు వేస్తున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆటో కార్మికులందరినీ ఐక్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేషు,రాజు, యువజన సంఘం నాయకులు సురేష్,ఆటో యూనియన్ నాయకులు కృష్ణ,షబ్బీర్,దాసు, మెహబూబ్ పాల్గొన్నారు.

# స్పందన వినతులు265

## జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 08-జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన 265 వినతులు తక్షణమే స్పందించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య మాట్లాడుతూ స్పందన విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీత కాల వ్యవధిలో గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..ఇంకా ఈ కార్యక్రమంలో 265 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవిన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## పట్టణంలో కుక్కలను అరికడతాం :డాక్టర్ అంకిరెడ్డి హెల్త్ ఆఫీసర్




నంద్యాల మా ప్రతినిధి జనవరి 08 - పట్టణంలో కుక్కలను అరరికడతామని వేట మొదలైందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొన్నారు . సోమవారం మున్సిపల్ కార్యాలయం యందు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో కుక్కలను ఆరికట్టేందుకు రాజస్థాన్ నుంచి గుత్తేదారుడు వచ్చారని తెలిపారు . ప్రభుత్వ ఆదేశాల మేరకు కుక్కల పట్టుటకు అనుభవం ఉన్న వాళ్లు ఉన్నారని ఆదివారం రోజే 46 కుక్కల పట్టారని తెలిపారు . వాటిని పీవీ నగర్ లో ఉన్న డంపు యార్డు వద్ద ఏర్పాటు చేసిన షెల్టర్ యందు ఉంచామని తెలిపారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా సోమవారం కుక్కల ను పరిశీలించి వాటి సంరక్షణ గురించి అడిగారని ఆయన అన్నారు

## భాష్యం స్కూల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు...




విభారె న్యూస్ జనవరి 09 ఎమ్మిగనూరు..పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో సోమవారం భాష్యం స్కూల్స్ రాయలసీమ జోన్ జెడ్ఈవో అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ కవిత ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు వేసిన హరిదాసు వేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగ మూడు రోజులు జరిగే ఒక్కరోజు ఒక్కో విశేషాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వచ్చే మొదటి పండుగ రైతుల పండుగ ఈ సంక్రాంతి అన్నారు. రైతులు తమ పండించిన పంటను ఇళ్ళకు తెచ్చుకొని సంతోషంగా సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకుంటారనిచెప్పారు. సంక్రాంతి పండుగ జీవితాల్లో వెలుగునిస్తూ రైతు కుటుంబాలలో ఆనందాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు ప్రధానంచేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ఇంచార్జ్ అనురాధ, అధ్యాప,అధ్యాపాకేతరకే సిబ్బంది విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

## డి దామోదర్ మరణం పార్టీకి తీరని లోటు..

### - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే. బాబురావు..

విభారె న్యూస్ జనవరి 08 కర్నూలు (జిల్లా ప్రతినిధి). జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డి దామోదర్ మరణం పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. దామోదర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిన డి రాముడి కుమారుడని రాముడు కార్మిక సంఘానికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన నాయకుడని కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు చేశారని. ఈ రోజు దామోదర్ అనారోగ్య కారణాల వల్ల మరణించడం చాలా బాధాకరంగా ఉందని వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియ జేస్తున్నా నని వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190